ప్రజాశక్తి

సోమవారం 29 సెప్టెంబర్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా



కృష్ణానదికి భారీగా వరద

- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- జలదిగ్బంధనంలో లంక గ్రామాలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, విజయవాడ సిటీ

కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. ఆదివారం రాత్రికి 6.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీంతో బ్యారేజీ 70 గేట్లలో 69 గేట్లను పూర్తిగా పైకి ఎత్తి 6,39,737 క్యూసెక్కుల మిగులు జలాలను అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టా సాగునీటి అవసరాల నిమిత్తం కృష్ణా తూర్పు, పశ్చిమ ప్రధాన పంట కాలువలకు 10,652 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద వరద ప్రవాహం 15.9 అడుగుల మేర కొనసాగుతుంది. కృష్ణా నదికి అనూహ్యంగా వరద పోటెత్తడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

నాగాయలంక వద్ద శ్రీరామపాద క్షేత్రం ఘాట్, కోడూరు మండలం హంసలదీవి సాగరసంగమం, మచిలీపట్నం మండలం కెపిటిపాలెం వద్ద వరద నీరు సముద్రంలో చేరుతున్నాయి. నదీపాయల్లో (మిగతా 2లో)

నవ సమాజ నిర్మాణ ప్రదాత జాషువా

వార్త 2లో

నేడు మూలా నక్షత్రం

- దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎం
- ఏర్పాట్లపై మంత్రుల బృందం సమీక్ష

ప్రజాశక్తి-విజయవాడ, సిటీ, అర్బన్: ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కీలక ఘట్టమైన మూలానక్షత్రం రోజున యాత్రికులు త్వరగా దర్శనం చేసుకునేందుకు చేసిన ఏర్పాట్లపై మంత్రుల బృందం ఆదివారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమీక్ష నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు, ఆలయ ఈవో వీకే శీనా నాయక్ ఏర్పాట్లపై చర్చించారు. ఇంద్రకీలాద్రిపై సరస్వతి దేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మధ్యాహ్నం మూడు గంటలకు దర్శించుకుని పట్టువస్త్రాలు (మిగతా 2లో)

నవ సమాజ నిర్మాణ ప్రదాత జాషువా

జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-విజయవాడ: తన కలాన్ని ఆయుధంగా చేసుకుని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన మహాకవి గుర్రం జాషువా అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. నవయుగ కవి చక్రవర్తి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న డా. కనకదుర్గ ప్రసాద్ రావు, డా. పాలపర్తి శ్రీధర్, మీసాల లక్ష్మణ్, పొట్లూరి హరికృష్ణ, కె.గురువమ్మలకు కవికోకిల పద్మభూషణ్ గుర్రం జాషువా 2025 పేరిట ఒక్కొక్కరికి 50 వేల రూపాయల నగదు పురస్కారాలను మంత్రి అందజేశారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని, కళా రత్న డా. పాలపర్తి శ్రీధర్ రచించిన ముక్తామణి పద్యశతకం పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అదేవిధంగా డిసెంబర్ 27, 28 తేదీల్లో జరిగే ప్రపంచ తెలుగు కవుల మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని తన పాండిత్యంతో పరవశింపజేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. ఒక ఒరవడిలో కొట్టుకుపోతున్న సాహిత్యాన్ని మలుపుతిప్పి పేదవాడి ఆకలి, అస్పృశ్యత, పేదరికం, కుల వివక్షతపై కలాన్ని చూపించాలన్న వ్యక్తి జాషువా అన్నారు. సాంస్కృతిక, సజనాత్మక సమితి ఛైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ గొప్ప కవి గురించి ఈ తరానికి తెలియకపోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో నాటక రంగ అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక, సృజనాత్మక సమితి ఛైర్ పర్సన్ తేజస్వి, డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఎన్టీఆర్ కలెక్టర్ జి. లక్ష్మీశ, ప్రముఖ రంగ స్థల, సినీ నటుడు మీసాల లక్ష్మణ్, నంది అవార్డు గ్రహీత డా. కనకదుర్గా ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



దేవాలయాల పునర్నిర్మాణానికి చర్యలు : ఆనం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని సంక్షేమాలతో పాటు ఆధ్యాత్మికతకు, సామాన్య భక్తులకు పెద్దపీట వేసిందని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తోట్లవల్లూరులోని శ్రీమద్ భ్రమరాంబ చెన్న మల్లికార్జున స్వామి దేవాలయాన్ని సందర్శించారు. పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆలయ ట్రస్టీలుగా ఉన్న శరత్ చంద్ర,మాజీ తెలుగు యువత అధ్యక్షులు రామినేని వెంకట కుటుంబ నరసింహారావు (కుటుంబయ్య), ఆలయ ఈవో హరి దుర్గా నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి మంత్రికి స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల పునర్నిర్మాణ పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో విధ్వంసం సృష్టించిందని, సమాజాన్ని భూస్థాపితం చేయాలనే దురాలోచనతో వ్యవహరించిందని అన్నారు. విజయదశమి పండగ సందర్భంగా జరుగుతున్న దేవీ నవరాత్రుల ఉత్సవాలలో అమ్మవారి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. రాష్ట్రంలో 500 దేవాలయాలకు పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ధూప, దీప, నైవేద్యల, కైంకర్యాల నిర్వహణకు అర్చకుల ఖాతాలలో రూ.10 నుంచి 15 వేలు ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు. ప్రధాన ఆలయాలలో ఒక పూట ఉచిత భోజన ప్రసాదం పంపిణీ చేయడానికి ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయం తో పాటు 800 దేవాలయాలలో పాలకమండలి సభ్యులను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారోన్, తాసిల్దార్ కుసుమకుమారి, ఎంపీడీవో ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ అమెరికా మారణకాండ, దురాక్రమాలకు వ్యతిరేకంగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ టెర్రరిజానికి నిరసనగా విజయవాడ పశ్చిమ నగర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఖాదర్ సెంటర్ నుండి పంజా సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు మాట్లాడుతూ భారత దేశ ఆర్థిక వ్యవస్థను వాణిజ్య వ్యవస్థను అమెరికా సామ్రాజ్యవాదం తమ ఆధీనంలోకి తీసుకునేందుకు విధిస్తున్న సుంకాల విధానాన్ని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా వ్యతిరేకించాలని కోరారు. పత్తి, ఔషధాలు, రొయ్యలు తదితర రంగాలపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధించడం భారత పారిశ్రామిక రంగాన్ని దెబ్బతీసే కుట్రలో భాగమని తెలిపారు. ప్రపంచ ప్రజలపై ఏ ఒక్క దేశం పెత్తనం చెల్లదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జి ఆదిలక్ష్మి, ఇవి నారాయణ, జి వెంకట్రావు, డి గణేష్, కె.సమీర్. అనిల్, సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్య బాబు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

విజయవాడ: సోవర్స్ మినిస్ట్రీస్, బేతేలు బైబిల్ కాలేజీ, బేతేలు మినిస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ అయోధ్యానగర్‌లోని బేతేలు ప్రార్ధన మందిరం ప్రాంగణంలో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజు విజన్ కేర్ సెంటర్ ప్రముఖ నేత్ర వైద్యులు డా. సల్మాన్ రాజు బృందం ఆధ్వర్యములో సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించగా 60 మందికి ఆపరేషన్లు చేయాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో బేతేలు మినిస్ట్రీస్, సోవర్స్ మినిస్ట్రీస్, బేతేలు బైబిల్ కాలేజీ ఫౌండర్, డైరెక్టర్ రెవ.సల్లూరి జయకుమార్‌బాబు, సంఘ పెద్ద యలమర్తి ఆంజనేయులు, మాదాసు నరేంద్ర, రెవ. సల్లూరి విజయకుమారి, కటారి కృష్ణ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

కృష్ణానదికి భారీగా వరద

లంక గ్రామాల ప్రజలు రవాణాకు ఉపయోగించే బోట్లు కొట్టుకుపోయాయి. తోట్లవల్లూరు మండలంలోని కనిగిరిలంక, పిల్లివానిలంక, తుమ్మలపచ్చికలంక, ములగలపల్లిలంక, తోడేళ్లదిబ్బలంక, పొట్టిదిబ్బలంక, రావిచెట్టుదిబ్బలంక, పాముల్లంక తదితర ఎనిమిది లంకల్లో మూడు వేల మంది జనాభా నిత్యావసరాలు తీసుకెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. ఈ నెల రెండో తేదీ నుంచి నాటు పడవల మీదే ప్రయాణించి సమీప గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉధృతి మరింత పెరిగితే లంక గ్రామాల ప్రజలను తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, ఐలూరు, రొయ్యూరుల్లో పునరావాస శిబిరాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో కృష్ణా పరివాహక ప్రాంతంలో వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఆరు వేల హెక్టార్లకుపైగా ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో పరివాహక ప్రాంతంలోని పంటలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు మూలా నక్షత్రం

సమర్పిస్తారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం విఐపి దర్శనాలు పూర్తిగా రద్దు చేసినట్లు చెప్పారు. అమ్మవారిని రెండు లక్షల పైచిలుకు యాత్రికులు దర్శించుకుంటారని అంచనా వేస్తున్నామని చెప్పారు. మంచినీటి బాటిళ్లతో పాటు పాలు, బిస్కెట్లు వంటి వాటిని అదనంగా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఎంతమంది వచ్చినా కోరినన్ని లడ్డూలు అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల సంఖ్యను పెంచడం జరిగిందన్నారు.

మూలనక్షత్రం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-విజయవాడ, సిటీ, అర్బన్

మూల నక్షత్రం సందర్భంగా దుర్గగుడికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఈ నెల 28వ తేదీ రాత్రి 7:30 గంటల నుండి 30వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఎటువంటి వాహనాలను అమ్మవారి గుడి వైపు అనుమతించబడవని పేర్కొన్నారు. పున్నమి ఘాట్ ఎంట్రన్స్ (కుమ్మరిపాలెం సెంటర్), తాడేపల్లి చెక్‌పోస్ట్, ఆర్టీసీ ఇన్ గేట్, కనకదుర్గ ఫ్లైఓవర్ ఎంట్రన్స్, గద్ద బొమ్మ సెంటర్ల వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు తెలిపారు. తాడేపల్లి చెక్‌పోస్ట్ నుండి బ్యారేజీ వైపు వచ్చే వాహనాలను కనకదుర్గ వారధి వైపు నుండి, గుంటూరు, వారధి వైపు నుండి భవానిపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లాల్సిన వాహనాలు కనకదుర్గ ఫ్లైఓవర్ మీదుగా, పిసిఆర్ వైపు నుండి భవానిపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లాల్సిన వాహనాలు గద్ద బొమ్మ మీదుగా, కాళేశ్వరం మార్కెట్, పంజా సెంటర్, విజి చౌక్, చిట్టినగర్ సొరంగం మీదుగా మళ్లించారు. పున్నమి ఘాట్, కుమ్మరిపాలెం వైపు నుండి నగరంలోకి వచ్చే వాహనాలను గుప్తా సెంటర్ మీదుగా సితార జంక్షన్, చిట్టినగర్, ఎర్రకట్ట, బిఆర్‌టిఎస్ వైపుగా మళ్లించారు. ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, వైపు నుండి నగరంలోకి ప్రవేశించే వాహనాలను గొల్లపూడి వై జంక్షన్ మీదగా సితార జంక్షన్, సివిఆర్ ఫ్లై ఓవర్, పైపుల్ రోడ్డు, సింగ్ నగర్ వైపు మళ్లించారు. విజయవాడ సిటీ నుండి, ఆర్టీసీ ఇన్ గేట్ వైపు నుండి రాష్ట్ర సచివాలయానికి, హైకోర్టుకు, రాజధాని అమరావతి వైపుకి వెళ్లే వాహనాలు కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా భవానిపురం, గొల్లపూడి వెస్ట్ బైపాస్ మీదుగా కానీ కనదుర్గ వారధి, తాడేపల్లి మీదుగా కానీ వాహనాలను మళ్లించారు.

బస్సుల్లేక ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-విజయవాడ: ఆర్టీసి సర్వీసులు అందుబాటులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ దసరా నవరాత్రి ఉత్సవాలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడం, స్త్రీ శక్తి పథకం, ఆదివారం సెలవు రోజు కావడంతో విజయవాడ పిఎన్ బస్‌స్టేషన్ ఆదివారం కిక్కిరిసిపోయింది. బస్‌స్టేషన్ పరిధిలో ఆయా ప్లాట్‌ఫారమ్స్ వద్దకు సర్వీసులు రాగానే ఎక్కేందుకు పోటీలు పడ్డారు. దసరాను పురస్కరించుకొని ఈ పది రోజులకు రోజువారీ షెడ్యూల్ సర్వీసులకు అదనంగా మరో వెయ్యి బస్సులు ఏర్పాటు చేశామని, ఈ రెండు, మూడు రోజుల్లోనే రోజుకు 150 ప్రత్యేక సర్వీసులతో పాటు అదనంగా అటు రాయలసీమ సెక్టార్‌కు మరో 28 సర్వీసులు గోదావరి జిల్లాలకు 30 సర్వీసులు ఆదివారం విజయవాడ సెంటర్ నుంచి నడుపుతున్నట్లు ప్రజా రవాణా అధికారి ఎంవై దానం వివరించారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అధికారులు వివరిస్తున్న సర్వీసులు, ఆయా ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన ప్రయాణికుల సంఖ్యకు అసలు పొంతనే లేదు. విజయవాడ సిటీతో పాటు రూరల్ ఏరియాలోని చైతన్య, నారాయ ఇతర కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వడంతో గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఒక్క సారిగా వేలాది మంది విద్యార్థులు ఆర్టీసి పిఎన్ బస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో ఆయా ప్లాట్‌ఫారాలు మొత్తం రద్దీ ఏర్పడింది. వారం రోజుల ముందుగానే టికెట్ల రిజర్వేషన్ చేసుకున్న వారికే ఆర్టీసి ప్రయాణం అన్నట్లుగా తయారైంది. ఆదివారం నాటి పరిస్థితి. ఎక్కువుగా రాయలసీమ సెక్టార్, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాలతో పాటు గోదావరి జిల్లాలకు వెళ్లాల్సిన విద్యార్థులకు ఆర్టీసి సర్వీసులు అందుబాటులో లేక రాత్రి వరకు వేచి ఉండక తప్పలేదు. వారం రోజుల ముందుగానే ఎవరయితే రిజర్వేషన్ చేసుకున్నారో వారికి మాత్రమే కొంత వరకు ఆర్టీసి సర్వీసు అందుబాటులో ఉంది. రిజర్వేషన్ చేసుకోకుండా బస్‌స్టేషన్‌కు చేరుకున్న విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా తయారయింది. గంటల తరబడి నిరీక్షించినా ఆర్టీసి సర్వీసు అందుబాటులో తీవ్రమైన ఇబ్బందులుపడ్డారు. కడప, కర్నూర్, అనంతపురం, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, గోదావరి జిల్లాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు సర్వీసులు అందుబాటులో లేక చివరకు విసిగి వేశారి ప్రయివేటు వాహనాలపై వేలకు వేలు చార్జీల రూపంలో వెచ్చించి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అనేక మంది వెల్లడించారు. విద్యార్థులు, దసరా యాత్రికులతో ట్రైన్లు కూడా కిక్కిరిసిపోయాయి.

గుర్రం జాషువాకు ఘన నివాళి

బందరులో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : బుట్టాయి పేట మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం జాషువా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి సాహితీ స్రవంతి కన్వీనర్ పి రాందేవ్, పౌర సంఘం నాయకులు కొడాలి శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజేష్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పూలే విజ్ఞాన కేంద్ర కన్వీనర్ పి నాగయ్య, కెవిపిఎస్ మచిలీపట్నం అధ్యక్షులు వసంతరావు, సిఐటియు నాయకులు బూర సుబ్రహ్మణ్యం, సిహెచ్ జయ రావు సిఐటియు జిల్లా కోశాధికారి పర్చూరు ధనశ్రీ సమాజ ఉద్ధరణకు జాషువా సేవలను కొనియాడారు. జాషువా తన రచనలు, ఆలోచనలు ద్వారా కులవివక్ష పైన మూఢాచారాలపైన తిరుగుబాటు చేసిన గొప్ప ఆధునిక కవి అన్నారు. ఈ సమాజంలో అసమానతలు కులవివక్ష అంటరానితనం ఆర్థిక అసమానతలు ఉన్నంతవరకు జాషువా సజీవంగానే ఉంటారని అందుకు మనమందరం ముందు ఉండి పనిచేయాలని వక్తలు కొనియాడారు. కే రాజారావు, కేవీపీఎస్ నాయకులు రాజు, వికలాంగుల సంఘం నాయకులు ఎన్ సత్య నారాయణ, కే వసంతరావు,భవాని తదితరులు పాల్గొన్నారు.

అలాగే మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరికవి, వాంఙ్మయి వ్యవస్థాపకులు డా.చింతలపాటి మురళీకష్ణ, సాహితీ మిత్రులు అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, పరిషత్ అధ్యక్షుడు కార్మూరి రాజేంద్రప్రసాద్, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, పరిషత్ కార్యదర్శి ముదిగొండ శాస్త్రి, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** నేటి యువత గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకుని, సమాజాభివద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని బాబు జగజ్జీవన్ రావు కల్చరల్ అధ్యక్షులు పచ్చిగళ్ళ దేవానందరావు అన్నారు. ఆదివారం తోట్లవల్లూరు గ్రామంలో గుర్రం జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుర్రం జాషువా 130 జయంతి వేడుకలను పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో ఉన్న గుర్రం జాషువా విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు గుర్రం జాషువా ఆదర్శప్రాయుడన్నారు. పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని కోరుతున్నామన్నారు. వల్లూరు సుదర్శన్,చదువుల ఆశీర్వాదం, ధరణికోట మధుబాబు, మట్ట వెంకట్ తేళ్ల వంశీలు పాల్గొన్నారు.

మహిళ ఇంటిపై జనసేన నాయకులు దాడి

- మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం పెదయాదర పంచాయతీ సర్పంచ్ గల్లా తిమోతి కోటి 50 లక్షలు అవినీతికి పాల్పడుతున్నాడంటూ కోర్టును ఆశ్రయించడంతో సర్పంచ్ ప్రోత్సాహంతో జనసేన నాయ కులు దాడి చేశారని నరసింహా రావు వాపోయారు. చిన్న యాదర తుమ్మ చెరువులోని మట్టి తవ్వకానికి పాల్పడుతున్న సర్పంచ్ గల్లా తిమోతిపై అనేకమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించి ఆర్డర్‌ను తీసుకొచ్చినట్లు, దీంతో కోర్టును ఆశ్రయించడం జీర్ణించుకోలేక జనసేన పార్టీ ఉప సర్పంచ్ శేషాద్రి వాసు పవన్, గళ్ళ లక్ష్మణ, కంచర్లపల్లి కోదండ రామారావులు ఇంటిపై దాడికి ప్రయత్నించగా మనస్థాపం చెందిన తుంగల నరసింహారావు భార్య సత్యవతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదివారం తెల్లవారుజామున మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నాగరాజు

ప్రజాశక్తి-ఘంటసాల : ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఘంటసాల మండలం చిలకలపూడి గ్రామానికి చెందిన కర్రా నాగరాజు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్లో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నాగరాజును ఎన్నిక చేసి ఘనంగా సత్కరించారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోన ఆంజనేయ కుమార్ (చంటి), ప్రధాన కార్యదర్శి జి.అనుపమ నియమాకపత్రాన్ని అందజేసి అసోసియేషన్ అబివద్ధికి కషి చేయాలనీ సూచించారు. ఏపీ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, వీఆర్వోలు, వీఆర్ఎలు పాల్గొన్నారు. ఘంటసాల, బాపులపాడు మండలాలకు చెందిన పలువురు వీఆర్వోలు, వీఆర్ఎలు, రెవెన్యూ సిబ్బంది ఈ సందర్భంగా నాగరాజుకు అభినందనలు తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్షా ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర ఆర్ట్ క్రాఫ్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ ఎన్.దేవేంద్రరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని విద్యారంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ ఇన్స్ట్రక్టర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు సుమారు 25 వేల మంది గత రెండు నెలల గా వేతనాలు రాక దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటు న్నారన్నారు. నిత్యం అలుపెరుగని సేవలు అందిస్తున్నా, ప్రతి నెలా వేతనం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందుతున్నప్పటికీ, వచ్చే వేతనమే తక్కువగా ఉండే కాంట్రాక్టు ఉద్యోగులు, ఇంటి అద్దెలు, పాల బిల్లులు, ఈ ఎం ఐ లు వంటి కనీస అవసరాలకు కూడా డబ్బులు లేక, మరలా అప్పులపాలవుతున్నరన్నారు. జీతాల కోసం ఈ విధంగా ప్రతినెలా ఎదురుచూపులు చూడడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందన్నారు. గత ప్రభుత్వం సైతం ఈ ఇబ్బందిని గుర్తించి, కాంట్రాక్టు ఉద్యోగులకు ముందుగా వేతనం చెల్లించిన తర్వాతే రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల బకాయిలు రాక ఉద్యోగులు దసరా పండుగ పూట కూడా పస్తులుండాల్సిన శోచనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి ప్రధాన కారణం, కేంద్రం బడ్జెట్ విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ను విడుదల చేయకపోవడమే కారణమన్నారు. ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే ఈ సమస్యపై జోక్యం చేసుకుని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : బీచ్‌లో స్నానం చేస్తూ అలల ఉధృతికి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మునిగిపోయిన సంఘ టన ఆదివారం చోటు చేసుకుంది. మచిలీపట్నం మండలంలోని మంగినపూడి బీచ్‌కి అధికంగా పర్యాటకులు వచ్చారు. ఈశాన్య రాష్ట్రానికి చెందిన హరి ప్రీత్ సింగ్ అతని మిత్రులు కలిసి బీచ్‌కి విచ్చేశారు. హరి ప్రీత్ సింగ్, అతని స్నేహితులు బీచ్‌లో లోపలకు వెళ్ళి ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదాన్ని గ్రహించిన మెరైన్ పోలీసులు యువకుడుతో పాటు మరొక ఇద్దరిని ఒడ్డుకు తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స నిర్వహించి సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన హరి ప్రీత్ సింగ్ గన్నవరం హెచ్సీఎల్ కంపెనీలో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేమ్స్‌పేట - కట్టవానిచెరువు రోడ్డు అధ్వానం

గతుకులమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని జేమ్స్‌పేట నుంచి కట్టవానిచెరువు రోడ్డు అధ్వానంగా మారిపోయింది. ఈ రోడ్డులో ఏర్పడిన మోకాలు లోతు గోతుల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ నీరు చేరుతుంది. దీనితో వాహన చోదకులు తమ ప్రయాణంలో ఏర్పడే ప్రమాదాల్లో గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి నుండి తాడిచర్ల, పురిటిపాడు, చినగొన్నూరు గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని కనీసం మరమ్మతులైన చేయాలని కోరుతున్నారు.

యువకుడిపై దాడి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం ఇంగ్లీష్ పాలెంలో సీతారామయ్య మెమోరియల్ పాఠశాల వద్ద ఆదివారం ఓ యువకుడిపై దాడి జరిగింది. ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి కూత వేటు దూరంలో జరిగిన ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు స్థానికులు తెలియజేశారు. నోబుల్ కాలనీకి చెందిన జోగి సాయి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులలో ఒకడి వద్ద ఉన్న బ్లేడ్‌తో విచక్షణ రహితంగా గాట్లు పెట్టడంతో తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమి త్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన వారిలో కొంతమందిపై గతంలో గంజాయి కేసులు ఉన్నట్లు సమాచారం. చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వరదతో లోతట్టు గ్రామాల్లో అలజడి

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణానదికి దివి సీమలో వరద మరోసారి పోటెత్తింది. దీనితో నదీ గర్భంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటివరకు ఈ ఏడాది మూడు దఫాలుగా వరదలు వచ్చినప్పటికీ ఒక్క పాత ఎడ్ల లంక గ్రామం తప్ప మిగిలిన ఏ గ్రామాలు వరద ప్రభావానికి గురి కాలేదు. అయితే ఈసారి ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు సముద్రంలోకి వదలడంతో సముద్రం ముఖద్వారంగా ఉన్న ది విసిమ ప్రాంతంలోని పలు గ్రామాలు నదీ గర్భంలో ఉన్నాయి. దీనితో వరద పెరిగితే ఇల్లు పశువులు, పంట పొలాలు వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలి రావలసి ఉంటుంది. ఈసారి వరద తీవ్రత పెరగడంతో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం ఉండాలని కోరుతున్నారు. ప్రజలు ఎవరు నాటు పడవల మీద ప్రయాణం చేయరాదని, కష్ణా నదిలో చాపల వేటకు వెళ్ళరాదని, లంక భూముల్లో ఉన్న పశువులను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎవరు మేతకు తోలుకు వెళ్లరాదని కోరారు. ఇప్పటికే పులిగడ్డ ఆక్విడేట్ వద్ద వంతెనకు సమాం తరంగా 17.5 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో ఇరిగేషన్ అధికారులు కూడా అప్రమత్తమై కరకట్టల పటిష్టానికి చర్యలకు సిద్ధపడుతున్నారు. నదీగర్భంలో వరదలకు గురవుతున్న పాతఎడ్లలంక గ్రామం కోతకు గురవుతుండగా ఇప్పటికే 17 గహాల వరకు కష్ణా నదిలో కోతకు గురై కలిసిపోయాయి. ఈసారి వార్త తీవ్రత పెరగడంతో మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించి అన్ని విధాల తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఆ గ్రామానికి పడవలపై ప్రయాణం సాగిస్తుండడంతో పోలీస్ రెవెన్యూ పంచాయతీ అధికారులు అక్కడే ఉండి ప్రయాణికు లకు సూచనలు ఇవ్వడంతో పాటు రక్షణ చర్యలు కూడా చేపడుతున్నారు.

పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ఉధృతి

వరద ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- మోపిదేవి : ప్రకాశం బ్యారేజ్ నుండి ఐదు లక్షలు క్యూసెక్కు నీరు కిందకు వదిలారని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ ఎం హరినాథ్ అన్నారు. ఆదివారం ఆయన లోతట్టు ప్రాంతాలైన కే కొత్తపాలెం, మోపిదేవి వార్పు వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. వరద ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారంఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరి ంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందనిన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. గుండె సంబంధిత వ్యాధులు, గుండె ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తూ కానూరు సెంటర్ నుంచి తాడిగడప వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ ర్యాలీ ప్రారంభ సందర్భంగా బోడే ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, తరచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. వ్యాయామం చేయడం, మంచి జీవన శైలిని అవలంబించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కామినేని మెడికల్ డైరెక్టర్ ఎన్.ఆర్.ఎస్. వర్ధన్ పర్యవేక్షణలో జరిగిన ఈ అవగాహన ర్యాలీలో డాక్టర్ కళ్యాణ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్. అర్చన, డాక్టర్ భరత్, డాక్టర్ సురేష్, కామినేని క్లస్టర్ హెడ్ పి. సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ 'ఎఐతో ఫ్యూచర్ లివింగ్, నౌ' ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :
అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, బికెసీలోని జియో వరల్డ్ ప్లాజాలో ఉన్న తన ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో "ఏఐ హోమ్: ఫ్యూచర్ లివింగ్, నౌ"ని ఆవిష్కరించిందని శామ్‌సంగ్ స్టోర్ మేనేజర్ ప్రతాప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.. శామ్‌సంగ్ ఏఐ హోమ్ అనేది తదుపరి తరానికి చెందిన కనెక్ట్ చేయబడిన జీవన పర్యావరణ వ్యవస్థ అని, ఇది సాటిలేని సౌలభ్యం, శక్తి సామర్థ్యం, వ్యక్తిగత అనుభవాలు అందించేందుకు ఉపకరణాలు, పరికరాలు, సేవలను సమగ్రంగా అందిస్తుందని తెలిపారు. ఇవన్నీ భద్రత, గోప్యతతో కూడిన అనుభవాన్ని వినియోగదారులకు అందిస్తాయని తెలిపారు.

నవంబర్‌లో అంతర్జాతీయ యూనిఫాం మానుఫ్యాక్టరర్స్ ఫెయిర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :సోలాపూర్ గార్మెంట్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, ప్రభుత్వ టెక్స్‌టైల్స్ శాఖ సహకారంతో 9వ అంతర్జాతీయ యూనిఫాం మానుఫ్యాక్చరర్స్ ఫెయిర్ 2025ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వి.ఆర్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 26.నుండి 28 వరకు ముంబైలోని గోరెగావ్ నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్ హాల్ నెంబర్ 4లో జరగనుందని తెలిపారు. ఈ మూడు రోజుల ఫెయిర్ 150కిపైగా జాతీయ బ్రాండ్‌లను ఒకచోట చేర్చనుందన్నారు. 30,000కుపైగా యూనిఫాం డిజైన్లు, 15,000 పైగా ఫ్యాబ్రిక్ డిజైన్లను ప్రదర్శిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం గ్లోబల్ యూనిఫామ్ పరిశ్రమకు అతిపెద్ద సోర్సింగ్ హబ్‌గా పనిచేస్తుందని వెల్లడించారు.

సోఫాల విభాగంలోకి సెంచురీ మాట్రెసెస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నిద్రవిషయంలో ప్రత్యేకత సాధించిన సెంచురీ మాట్రెసెస్ ఇప్పుడుకొత్తగా సెంచురీ సోఫాలతో బెడ్రూమ్‌ల నుంచి లివింగ్ రూమ్‌లలోకి కూడా ప్రవేశించిందని సంస్థ ప్రతినిధి ఉత్తమ్ కానీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నాళ్లూ పరుపులు, దిండ్లకే పరిమితమైన ఈ కంపెనీ ఇప్పుడు కంఫర్ట్ టెక్నాలజీలోకి అడుగుపెట్టిందని తెలిపారు. ఫర్నిచర్ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోందని, దీంతోసెంచురీ సంస్థ ఆధునిక డిజైన్లు, కంఫర్ట్ సైన్స్ రెండింటినీ మిళితం చేసి ఒక విభిన్నమైన సౌకర్యాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో 3 సీటర్, 2 సీటర్, సింగిల్ సీటర్, ఇంకా పొడవైన యూనిట్లు కూడా ఉన్నాయన్నారు. వేర్వేరు ధరల్లో ఇవి అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గాంధీ హిల్ పూర్వవైభవానికి కృషి

- ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ నగరాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా గాంధీ హిల్ పునర్వైభవానికి కృషి చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో గాంధీ హిల్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన గాంధీ హిల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కేపీసీ గాంధీ, వైస్ చైర్మన్ జంద్యాల శంకర్‌తో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ విజయవాడ నగరానికి కృష్ణానది, ఇంద్రకీలాద్రి, కొండపల్లి బొమ్మలు, మూడు కాలువలు ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, ప్రజలు ఆస్వాదించేలా గాంధీ హిల్ తీర్చిదిద్దుతామని ఎంపీ తెలిపారు. గాంధీ హిల్ అభివృద్ధి

కమిటీ చైర్మన్ కెపిసి గాంధీ మాట్లాడుతూ గాంధీ హిల్‌ను నాలుగు దశల్లో అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రీసెర్చ్ స్కాలర్స్ ఇక్కడికి వచ్చి మహాత్ముని జీవన విధానంపై రీసెర్చ్ చేయడానికి అవసరమైన ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగా 100 గదులతో కూడిన గెస్ట్ హౌస్ నిర్మించాలని ప్రసాదించినట్లు పేర్కొన్నారు.

అలరించిన దాండియా నృత్యాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్
వి వైబ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటైన దాండియా, గార్భా నృత్యాలు కోలాహలంగా సాగాయి. నిర్వాహకుల అంచనాలకు మించి ఈ నృత్యానికి విజయవాడ వాసుల నుండి విశేష స్పందన లభించింది. ఆడ, మగ అనే తేడా లేకుండా ఈ నృత్యంలో పాల్గొని సందడి చేశారు. స్థానిక స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో ఏర్పాటైన దాండియా నైట్ ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా కొనసాగింది. ఈ నృత్యంలో అన్నిరకాల ఒత్తిళ్లను తగ్గించి మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని నిర్వాహకులు రాగ వీణ అన్నారు.

అరికట్ల వెంకటేశ్వరరావుకు కళా నటరత్న పురస్కారం

ప్రజాశక్తి-వీరులపాడు : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన అరికట్ల వెంకటేశ్వరరావుకు కళా నటరత్న పురస్కారం లభించింది. సర్వేస్వరా నాట్యమండలి హైదరాబాద్ వారు కూకట్‌పల్లిలో భారత వికాస్ పరిషత్ కళా నాటక రత్న పురస్కారాన్ని ఈ నెల 25న పలువురు ప్రముఖుల చేతగా మీదగా అందుకున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సినిమా, సీరియల్ నాటక రంగాల్లో 26 ఏళ్ల కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు లభించింది. కళా రంగంలో రాణిస్తున్న వెంకటేశ్వరరావుకు కళా నటరత్న పురస్కారం రావడంపట్ల పలువురు కళాకారులు, గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో అనేక పురస్కారాలు సాధించాలని కోరుతున్నారు.

గురుకుల మైనార్టీ పాఠశాల హాస్టల్‌ను తరలించొద్దు

- బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ :ఎపి మైనార్టీ గురుకుల పాఠశాల తరలింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ భవానిపురం ఐరన్ యాడ్ వద్ద ఉన్న ఏపీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్కూలు అధ్యాపక సిబ్బందితో మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల నుంచి మైనార్టీ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు చెందిన 211 మంది బాలికలు గురుకుల పాఠశాలలో 5 నుండి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలో దసరా సెలవులు ప్రకటించి పేరెంట్స్‌కి, విద్యా కమిటీకి తెలియకుండా హడావుడిగా స్కూల్‌ను ఇక్కడి నుంచి ఏలూరుకు మార్పు చేయడం తగదన్నారు. భవానిపురం మైనార్టీ గురుకుల పాఠశాల

సమీపంలో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన 50 ఎకరాల భూమి ప్రైవేట్ కంపెనీల చేతుల్లో ఉందని, ఆ స్థలంలో హైస్కూలు, కాలేజీ, రెసిడెన్షియల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, వెంకటేశ్వరరావు, పశ్చిమ నగర కార్యదర్శి ఎస్‌ఎస్విని, శ్రీకాంత్, సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎండి మస్తాన్, జి వెంకట్రావు, ముఠావర్క సీనియర్ నాయకులు రామారావు ఆందోళనకు మద్దతు పలికారు.

మూలా నక్షత్రం రోజున అప్రమత్తంగా ఉండాలి

వీఎంపి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : మూల నక్షత్రం రోజున మరింత అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి లోపం లేకుండా విజయవాడ నగరపాలక సంస్థ తరఫున త్రాగునీరు సరఫరా, పారిశుధ్యం, మరుగుదొడ్లు, చెప్పుల స్టాండ్లు, సామాన్లు భద్రపరచు ప్రదేశాలలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదివారం నాడు జరిగిన టెలికాన్ఫరెన్స్లో అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మూల నక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున, ప్రత్యేకంగా మూల నక్షత్రం మరియు మరుసటి రోజు పనిచేయుటకు అదనంగా 300 మందికి దసరా విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు, షిఫ్ట్ కి 100 చెప్పు నా మూడు షిఫ్టల్లో పనిచేస్తున్నారని, భక్తులకు ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వాడవాడలా భగత్‌సింగ్ జయంతి

ప్రజాశక్తి-విజయవాడ :భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. డివైఎఫ్ఐ, వాకర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఆదివారం జరిగిన వేడుకల్లో భగత్ సింగ్ చిత్రపటానికి వాకర్స్ అసోసియేషన్‌ల అధ్యక్షులు సోము చంద్రరావు. బొమ్మిశెట్టి రమేష్. నెమలికంటి భవాని ప్రసాద్, డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్, పౌర సంక్షేమ సంఘం నాయకులు, బి రమణారావు, దసరా సాంస్కృతిక ఉత్సవ కమిటీ కన్వీనర్ ఏ పున్నారావు తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. రాణిగారితోట 17వ డివిజన్, కృష్ణలంక 22వ డివిజన్ డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... లౌకిక రాజ్యాంగ వ్యవస్థను నిలబెట్టుకోవడంలో భగత్ సింగ్ ఇచ్చిన స్ఫూర్తిని

విజయవాడ ఎంసి స్టేడియంలో భగత్‌సింగ్‌కు నివాళి

యువతరం, విద్యార్థి, మహిళ, రైతులు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ కోరుకున్న సమసమాజం కోసం నేటి యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.వైఎఫ్ఐ జిల్లా

50వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

కార్యదర్శి ఎన్.నాగేశ్వరావు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.సోమేశ్వరరావు, డివైఎఫ్ఐ సెంట్రల్ సీటీ నాయకులు శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు మాధవ్, ప్రజాసంఘాలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భగత్ సింగ్‌ని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు సిపిఎం నేతలతో కలిసి గొల్లపాలెం గట్టు భగత్ సింగ్ సెంటర్లో నిర్వహించారు. కెబిఎన్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ హేమ్చంద్ భగత్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పి రాజు, కె నాని, సిఐటియు నాయకులు వీ.సాంబులు, బి రాము . బి దుర్గారావు కే దుర్గారావు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై యాత్రికుల రద్దీ

- ఏడో రోజున చండీ దేవి అలంకారంలో దుర్గమ్మ...
- నేడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న చంద్రబాబు

ప్రజాశక్తి - విజయవాడ, సిటీ, అర్బన్ : విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దేవి శరన్నవరాత్రుల ఏడో రోజున శ్రీ మహా చండీ దేవి అలంకరణలో దుర్గమ్మ అమ్మ వారు యాత్రికులను అనుగ్రహించారు. ఈ22న ఉత్సవాలు ప్రారంభం కాగా తొలి మూడు రోజులు 70 నుంచి 80 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకోగా, 25 నుంచి ప్రతిరోజు లక్ష మందికి పైగా దుర్గమ్మ దర్శనం కోసం ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. దుర్గమ్మ సుప్రభాత సేవ నిత్య పూజలు అనంతరం తెల్లవారుజామున మూడు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అన్ని క్యూ లైన్లను సర్వదర్శనాలుగా ప్రకటించి అమ్మవారి దర్శనానికి అనుమతిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 7గంటల సమయానికి లక్ష ఐదు వేల మంది సందర్శకులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటన విడుదల చేశారు.

ప్రముఖుల తాకిడి..

దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రికి ఏడో రోజున ప్రముఖుల తాకిడి పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, మంత్రులు కందుల దుర్గేష్, ఎస్ సవిత, చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి, విశ్రాంత న్యాయమూర్తి కపాసాగర్, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేసినేని శివనాథ్ , తణుకు శాసనసభ్యులు ఏ రాధాకష్ణ, వేమూరు ఎంఎల్ఎ నక్కా ఆనందబాబు, అంతర్జాతీయ విలువిద్యా క్రీడాకారిణి జ్యోతి సురేఖ దుర్గమ్మ వారిని దర్శించుకొన్న వారిలో ఉన్నారు.

శోభాయమానంగా నగరోత్సవం...

దసరా ఉత్సవాలలో ప్రతి రోజు సాయంత్రం నిర్వహిస్తున్న ఆదిదంపతుల నగరోత్సవ కార్యక్రమం అటహాసంగా సాగుతుంది. కనకదుర్గ నగర్ నుంచి ఇంద్రకీలాద్రి వరకు సాగిన నగరోత్సవంలో వేద పండితులు దేవస్థానం సిబ్బంది ఉత్సవ కమిటీ సభ్యులు యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాలకు నో ఎంట్రీ..

సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా 28వ తేదీ రాత్రి 7.30 నుంచి 30 ఉదయం 10 గంటల వరకు పాత బస్తీ వైపుకు వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు సీపీ రాజశేఖరబాబు తెలిపారు. కుమ్మరిపాలెం, తాడేపల్లి చెక్పోస్ట్, కాలేశ్వరరావు మార్కెట్ గద్ద బొమ్మ సెంటర్ నుంచి అమ్మవారి గుడి వైపు బైక్లు, వాహనాల రాకపోకలకు అనుమతించమన్నారు. నగరంలోకి ప్రవేశించే వాహనాలు పోలీసుల సూచనల మేరకు వారధి, వెస్ట్ బైపాస్, కనకదుర్గ ఫ్లైఓవర్, చిట్టినగర్ సొరంగం,బి ఆర్ టి ఎస్ రోడ్డు, సీవీర్ ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణం చేయాలని సూచించారు.

రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బలగాలు కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్ బాబు, ఈవో శీనా నాయక్

అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజున శ్రీ సరస్వతి దేవి అలంకారంలో దర్శనం ఇవ్వనున్న

దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే సందర్శకుల కోసం పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మూల నక్షత్రం రోజున దర్శన ఏర్పాట్ల పై

విజయ వాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో శీనా నాయక్ తో కలసి ఆదివారం ఇంద్రకీలాద్రిపై మీడియాతో మాట్లాడారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ పెరిగిన భక్తుల రద్దీ నేపథ్యంలో అదనంగా ఏపీఎస్పీ ప్లటూన్లను రప్పిస్తున్నా మని, రోప్ పార్టీలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. దుర్గగుడి ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ.. సోమవారం రెండు లక్షల మంది అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని చెప్పారు.

– దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం శ్రీ మహాచండి దేవి అలంకరణతో దర్శనమిస్తున్న అమ్మవారిని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు.

– మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ శంభాజీ షిండే కుమారుడు, కళ్యాణ్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ శ్రీకాంత్ షిండే తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు.

అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి - విజయవాడ, సిటీ, అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ సారథ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టివ్ కార్నివల్ విజయవాడ ఉత్సవ్ నగరంలోని ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో 7వ రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విజయవాడకు చెందిన నాట్యాచారిణి బాగవత్తుల వెంకటరామ శర్మ కూచిపూడి నత్య రవళి ప్రదర్శన కన్నుల పండువుగా సాగింది. తొలుత వినాయక ప్రార్ధన తో కూచిపూడి నత్య ప్రదర్శన ప్రారంభించగా శివస్తుతి,ప్రహ్లాద్ శబ్దం, రామదాసు కీర్తన, దశావతారం లాంటి అద్భుత కూచిపూడి నత్య రవళి ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కూచిపూడి నత్య కళాకారులు చరిష్మా , వేద సమీరా, శ్రియ, మేఘన, సుధీర్తి, చకినిత, గేష్మ, సాయి అక్షయ, మానస్వి లు అద్భుత ప్రదర్శన చేశారు. అలాగే తాడేపల్లిగూడెంకు చెదిన వై విజయ్‌కుమార్ బందం పాడిన ఫోక్ సాంగ్స్(జానపద గీతాలు) ప్రేక్షకులను అలరించింది. అలాగే నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో హైదరాబాదు నుంచి వచ్చిన స్నేహలత శిష్య బందంచే ప్రదర్శించిన బడిన కూచిపూడి నత్య ప్రదర్శన కళాలో పట్టువను ప్రదర్శించింది. స్నేహలత శిష్య బందం గతణపతి తాళంతో ప్రారంభించి శ్రీవిద్య ఉపాసన కీర్తనలు, దుర్గాదేవి వైభవానికి సంభందించిన కీర్తనలతో రంజంప చేశారు. స్నేహలత శిష్య బందం ఇచ్చిన ప్రదర్శన అద్భుతంగా ఆకట్టుకుంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జడ్పీ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ ప్రత్యేకంగా పాల్గొని ప్రదర్శనలను ఆస్వాదించారు. అలాగే ఏపీ సుజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ చైర్మన్ పి. తేజస్వీ, నాటిక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.ప్రేక్షకులు అన్ని వయసుల వారు భారీ ఎత్తున తరలివచ్చి ఈ సాంస్కృతిక వైవిధ్యాన్ని తిలకించి ఆనందించారు. విజయవాడ ఉత్సవ్ వేదికతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది.అలాగే గొల్లపూడి–జక్కంపూడి రోడ్డులో ఏర్పాటు చేసిన విజయవాడ ఎగ్జిబిషన్ ఆదివారం సాయంత్రం సంగీత వాతావరణంతో సందడిగా మారింది. ప్రసిద్ధ సింగర్, మ్యూజిక్ డైరెక్టర్ రామ్ మిరియాల తన బందంతో కలిసి ఇచ్చిన లైవ్ మ్యూజిక్ కచేరీ ప్రేక్షకులను అలరించింది.

ప్రపంచ దేశాల్లో యోగాకు ప్రత్యేక గుర్తింపు

- ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రపంచ దేశాల్లో యోగాకి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది సాక్షాత్తు మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ అని ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు. స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో నాలుగు రోజులపాటు జరగనున్న 6వ జాతీయ జూనియర్, సీనియర్-సి యోగాసన ఛాంపియన్‌షిప్‌ను ఆదివారం రఘురామ కృష్ణరాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అలాగే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని పేర్కొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ యోగాసనాలు శారీరక, మానసిక ఆరోగ్యానికి పునాది అన్నారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 1500 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక, ఉపాధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, యోగాసన భారత్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ శ్రేయస్ మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాస్తారోకో

ప్రజాశక్తి-.కొండూరు ఎ.కొండూరు అడ్డ రోడ్డు నుండి విస్సన్నపేట వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం గిరిజనులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు మాట్లాడుతూ ఎ.కొండూరు అడ్డరోడ్డు నుండి విస్సన్నపేట వరకు రోడ్డంతా గుంతల మయమై వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారిందన్నారు. వర్షం కురిసిన రోజుల్లో గుంతలన్నీ వర్షపు నీటితో నిండిపోయి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాస్తారోకో చేయాల్సి వచ్చిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గుంతలమయమైన ఎంఎస్‌కె రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు భరోతు కేవళ, పాల్రియా బద్దు, అంగోతు బాలాజీ, శివాజీ,బి. జమ్ము, బి.బిచ్చాలు, భూక్యా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలి

ప్రజాశక్తి-విస్సన్నపేట : పేదలు సాగు చేస్తున్న భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామంలో ఆదివారం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామంలో ఆర్ఎస్ నెంబర్ 280 నుండి 341 సర్వే నెంబర్లో సాగు చేసుకుంటున్న 231 ఎకరాల భూమికి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, సాగుదారులకు అన్ని హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, రాంబాబు, చిన్నారావు పాల్గొన్నారు .

ప్రమాదాలకు నిలయంగా మునుకుళ్ల రహదారి

ప్రజాశక్తి - తిరువూరు : మహాప్రభో కళ్ళు తెరిచి చూసి స్పందించండి. లేదంటే పండగ వేళ ఎన్ని ప్రమాదాలు చూడాలోనని మునుకుళ్ల గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తిరువూరు నుండి మునుకుళ్ళ, వావిలాల, ఎర్రమాడు, గొల్లపూడి, అర్లపాడు, గాదేవారిగూడెం, ఊటుకూరు మీదగా తెలంగాణ రాష్ట్రం మధిర వెళ్లే రహదారి మునుకుళ్ళ గ్రామంలో సొసైటీ కార్యాలయం వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇదే రోడ్డు అక్కపాలెం మీదగా కల్లూరు, ఎర్రబోయినపల్లి లింగాల గ్రామంలోని మధిర, కల్లూరు రోడ్డుకు వెళ్తుంది. చిన్న వాహనాల నుండి భారీ వాహనాల వరకు నిత్యం ఈ రోడ్డులో రాత్రింబవళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎంతో మంది వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాల బారినపడ్డారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున గోతుల్లోకి నీరు చేరడంతో దారి ఎక్కడుందో తెలియక గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. శనివారం రాత్రి ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు బైక్‌పై వెళ్తూ గోతుల్లో పడి గాయపడ్డారు. ఆర్అండ్‌బి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామకు చెందిన ఐదు పుస్తకాలు ఒక్క దృశ్యం పుస్తక రచయిత సూర్యదేవర రామకృష్ణ రాసిన మానవత్వం వర్సెస్ దేవుడు, దేవుని పూజలో అంగులు ఆర్భాటాలు, మనశ్శాంతి, అవసరానికి మించి తినడం, ఆధునిక మనిషి దష్టిలో నేటి రాజకీయాలు, ఐక్యతకు విఘాతం పుస్తకాలను సినీ నటుడు అవసరాల శ్రీనివాస్ నందిగామ రామకృష్ణ ప్లాజాలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా సినీ నటుడు అవసరాల శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ వైస్ అమ్మినేని జోల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌లో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

విజయవాడ రూరల్: ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ వాధ్వానీ ఫౌండేషన్, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపెటెన్సీస్ సంయుక్తంగా విజయవాడ రూరల్ నున్నాలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో నిర్వహించిన "21వ శతాబ్దపు నూతన బోధన విధానాలపై ఆకడమిషియన్ల సిద్ధత" అనే మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి స్పోక్, కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్. కిషోర్ రెడ్డి, వాధ్వానీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 35 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. నూతన బోధన పద్ధతులు, మూల్యాంకనంలో సాధనాల వినియోగం, "లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్" నిర్వహణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన టెక్నాలజీ ఆధారిత సాధనాలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యదర్శి ఎన్.సత్యనారాయణ రెడ్డి శిక్షణ పొందిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

అసమానతలపై కలమెత్తిన జాషువా

జగ్గయ్యపేట: రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఆదివారం గుర్రం జాషువా 130వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సభకు రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ కవి, రచయిత దోసపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ జాషువా కవిత్వం నిత్య నూతనమైనదన్నారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గుండెపొగ జాన్సన్ దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు. **నందిగామ** :నందిగామ గ్రంథాలయంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ అధికారి రామచంద్రుడు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ కృష్ణమూర్తి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు జాషువాకు నివాళులర్పించారు. **విజయవాడ అర్బన్ :** సామాజిక అసమానతలపై తన కవితలతో కలమెత్తిన నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువా నిరంతర స్మరణీయులని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ నివాళులర్పించారు. కవికోకిల 130వ జయంతి సందర్భంగా విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రం వద్దగల జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ సమాజంలోని కులాల అంతరాలపై జాషువా తన కవిత్వ కరవాలాన్ని ఝుళిపించారని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ బుచ్చిరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో జాషువాకు నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్లు విడుదల

తిరువూరు : వైసీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్ల ను పార్టీ నాయకులు తిరువూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి నాయకులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు ఎదురైన, దాడులు జరిగినా, అక్రమ కేసులు పెట్టినా డిజిటల్ బుక్ లో నమోదు చేయాలని నాయకులు కార్యకర్తలకు పిలు పునిచ్చారు. ఈకార్యక్రమంలో వైసీపీ నియోజ కవర్గ పరిశీలకులు నాయకులు తంగిరాల రామిరెడ్డి, పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: డిజిటల్ బుక్ వైసిపి కుటుంబ సభ్యులకు కొండంత అండని నియోజకవర్గ పరిశీలకులు ఆళ్ల చల్లారావు, వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం డిజిటల్ బుక్ పోస్టర్లను వైసిపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైసిపి కార్యకర్తలు డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమారి కాకర్ల హరిప్రియ రూ.93649లు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కె రవీంద్ర భరద్వాజ్, ఆలయ సహాయ కమిషనర్ కె సాంబశివరావు పాల్గొన్నారు.

మద్దులమ్మ ఆలయంలో దసరా వేడుకలు

ప్రజాశక్తి -కంచికచర్ల :కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామ అడివిలో ఉన్న మద్దులమ్మ దేవాలయంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకుని ఆదివారం యాత్రీకులు సందడి నెలకొంది. కంచికచర్లతో చుట్టుపక్కల ప్రాంతాల నుండి తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు యువకులు మద్దులమ్మ ఆలయం వద్ద జలపాతంలో దిగి కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తున్నారు. అయితే, కొండపై దేవాలయం వద్ద సరైన వసతి సౌకర్యం లేక యాత్రీకులు ఇబ్బందులు పడ్డారు.

పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ : దసరా-దీపావళి పండుగ సందర్భంగా నందిగామలో ఆదివారం నిరుపేద, వృద్ధులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. నవాబుపేట గ్రామ వాస్తవ్యులు పోలిశెట్టి సుధాకర్ జ్ఞాపకార్థం కుమారుడు పోలిశెట్టి వెంకట్రావు - శైలజ , ఆర్యవైశ్య సంఘం నందిగామ ప్రముఖుడు పారేపల్లి సాయిబాబు ఆధ్వర్యంలో 25 మందికి 10 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బతి జనార్ధనరావు, వాసవి క్లబ్ సిల్వర్ స్టార్ అధ్యక్షుడు పులిపాటి వెంకటేశ్వరరావు, నకరికంటి వెంకటేశ్వరరావు, సముద్రాల ఈశ్వరయ్య, మారం భాస్కరరావు, పుడతా శ్రీను, నల్లమల్లి బాబీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ

ప్రజాశక్తి-నందిగామ : దసరా సెలవుల్లో నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భాగంగా వత్తి విద్య శిక్షణ కార్యక్రమం చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి వత్తి విద్యా శిక్షణ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో షేక్ సైదావలి, నాగేశ్వరరావు సిహెచ్ తేజస్వి రాష్ట్ర ఇంటర్నెట్ షిప్ అధికారి దీపికా రాణి, జిల్లా వృద్ధి సమన్వయకర్త పి. వెంకట్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులను సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ దసరా సెలవుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ తీసుకున్న విద్యార్థులును వాళ్ల లక్ష్యాలు వైపు నడిపిస్తాయని తెలిపారు.

ముక్త్యాలలో శరన్నవరాత్రులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామంలోని శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఏడవ రోజు ఆదివారం శ్రీ భువనేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి లక్ష్మణ ఇందిరాదత్తు, కార్యనిర్వాహణాధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవనిగడ్డలో డయేరియా కలకలం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ లోని 7 ,8 వార్డులలో 8 మంది డయేరియాకు గురై అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దీనింతో ఒక్కసారిగా ఆ ప్రాంత ప్రజలు భయాందోళ నలకు గురవుతున్నారు. మూడు రోజుల నుండి ఆ ప్రాంతంలో డయేరియా సోకినట్లు రోగులు చెబుతున్నారు. ఇప్పటికే 8 మంది వైద్యశాలలో చికిత్స పొందుతుండగా దీనికి సంబంధించి ఇప్పటివరకు ఆ ప్రాంతంలో ప్రత్యేక చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా ఇంటింటా సర్వే నిర్వహించి డయేరియాకు కారణాలను కనుగొనవలసి ఉంది. దీనిపై వేకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ను వివరణ కోరగా తమ దష్టికి వచ్చిందని, ఆదివారం ఉదయం క్లోరినేషన్ చేయించామన్నారు. అయితే పంచాయతీ వారు విడుదల చేసే నీటి ద్వారానే డయేరియా వ్యాపించిందని అనుమానాలు వైద్యులు వ్యక్తం చేస్తున్నారు. ఒక రెండు కేసులు విజయవాడకు చికిత్స నిమిత్తం తరలించినట్లు కూడా చెప్పారు. దీనితో పంచాయతీ వారు బ్లీచింగ్ చల్లి సానిటేషన్ చేసినట్లు తెలిపారుజ. తాగు నీటిని టెస్టింగ్ కి పంపినట్లు డాక్టర్ రియాజ్ తెలిపారు. కాగా మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామానికి చెందిన వారు కూడా ముగ్గురు డయేరియా కు గురై వైద్య చికిత్స పొంది వైద్యశాల నుండి డిశ్చార్జి వెళ్లినట్లు తెలిపారు. ఒకపక్క కష్ణా నదికి వరద తీవ్రత ఉధతంగా వస్తుండగా మరోవైపు అవనిగడ్డ గ్రామంలో డయేరియా వార్త కలకలం సష్టించడంతో అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మన వైపు ఎనిమిదో వార్డులో రోడ్డుపైనే పశువుల ఎరువుల వ్యర్థాలు ఉండటంతో పాటు వాటితో కలిసి మురుగునీరు ప్రవహించడం కూడా కనిపించింది. తరచూ కురుస్తున్న వర్షాలు చిత్తడిగా మారిన నేలలు పశువుల ఎరువులతో కలిసి ప్రవహిస్తున్న నీరు అక్కడి వాతావరణం డయేరియా కేసులు పెరగడానికి ఎక్కువ అవకాశం కలిగిస్తుంది. అందువల్ల అక్కడ ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. అదేవిధంగా పంచాయతీ కుళాయిల ద్వారా వచ్చే కలుషిత నీటిని ఆపేసి శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులు

రోగులను పరామర్శిస్తున్న మండలి వెంకట్రాం

వ్యర్థాలతో కలసి ప్రవహిస్తున్న మురుగునీరు

వైద్య శిబిరం ప్రారంభిస్తున్న కొనకళ్ళ జగన్నాధరావు

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రపంచంలో ఉన్న తెలుగువారి అందర్నీ ఏకం చేసిన వ్యక్తి మండలి వెంకటకష్ణారావు అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధ రావు(బుల్లయ్య) కొనియాడారు. ఆదివారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కీర్తిశేషులు మండలి వెంకటకృష్ణారావు 28వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో విజయవాడ పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ శంకర్ నేత్రాలయ నుంచి వైద్యులు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుల్లయ్య, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, డాక్టర్ పల్లెం పెద్దేశ్వర రావు, డాక్టర్ పల్లెం ఆకాష్ లతో కలిసి కష్ణారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించి వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్ణారావు కులాలకు పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేశారన్నారు. బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆహారపు అలవాట్లతో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు, ఉద్యోగ సమస్యలు దృష్ట్యా అకాల మరణాల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం ఏర్పాటుచేసిన ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు, స్టేట్ మత్స్య శాఖ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి-కంకిపాడు : తుమ్మల ఆంజనేయులు ట్రస్ట్, ఆంధ్రా యూరాలజీ అండ్ గైనకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కానూరు మహాదేవపూర్ కాలనీ శ్రీధర్మా రెసిడెన్సీ వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. సమీప ప్రాంతాల ప్రజలు ఈ శిబిరంలో పెద్దసంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. యూరాలజీ, యూరో ఆంకాలజీ, ఆండ్రాలజీ, రోబోటిక్ సర్జన్ డాక్టర్ మనోజ్ తుమ్మల, గైనకాలజీ యూరో గైనకాలజీ, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శ్రీ వర్షిణి రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్, మూత్ర ప్రవాహ పరీక్ష, పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిర నిర్వహణకు డాక్టర్ ఎం.రంగారావు, బి మోహన్,కే రామకష్ణ,జి రాధాకష్ణ,టి అజయ్,కే నాగభూషణరావు, డి. సత్యనారాయణ, మురళి తదితరులు సహకరించారు.

వైసిపి క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పామర్రు : కూటమి ప్రభుత్వంలో వైఎస్ ఆర్సిపి కార్యకర్తలు ఎదుర్కొం టున్న సమ స్యల్ని పొందుపరి చేందు కు ఆ పార్టీ నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ను ఆ పార్టీ నాయకులు స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వ రరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఎంఎస్ ప్రసాద్‌కు అవార్డు అందజేత

ప్రజాశక్తి-పామర్రు : రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషసేవ రత్న పురస్కార గ్రహీత, రచయిత,సామాజిక సేవ కర్త పామర్రుకు చెందిన పి.ఎం.ఎస్. ప్రసాద్ రాసిన 'కవి కోకిల రాగం' అనే వ్యాస సంపుటిని గుర్తించి తెలుగు కళా రత్నాలు సేవ సంస్థ వారు గుర్రం జాషువ జయంతిని పురస్కరించుకొని ఆదివారం విజయవాడలో కౌతా వారి ఆడిటోరియంలో గుర్రం జాషువ స్మారక అవార్డును ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్ అడిషనల్ ఎస్. పి.గోసేవా సంస్థ చైర్మన్ డా.జి.మురళీ కష్ణ, కృష్ణా జిల్లా న్యాయ వాదుల సంఘ పూర్వ అధ్యక్షులు అజరయ్య గుప్తా, కళా రత్నాల సంస్థ అధ్యక్షులు డా.యు.వి. రత్నం,కార్యదర్శి డా. ధనాసి ఉష రాణి తదితరులు ప్రసాద్ కి అవార్డు ను ఇచ్చి సన్మానించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఈ-పంటను రైతులు సంబం ధిత రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రమేష్ అన్నారు. ఆదివారం ఆయన పాత్రికేయుల తో మాట్లాడుతూ మండలంలో 27 వేల ఎకరాలు సాగుభూమి ఉండగా నేటికీ 23,500 ఎకరాలు నమోదు అయిందన్నారు. మిగిలిన రైతులు కూడా ఈపంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 30 వ తేదీ నాటికి పంట నమోదు చేయించుకోవాలని, దీనిని నమోదు చేయించుకోకపోతే ప్రక్రతి విపత్తుల వల్ల పంటకు నష్టం జరిగితే ఎలాంటి పరిహారం రాదన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ అమ్మవారికి సహస్రనామార్చన, సమస్త మంగళకర ప్రాప్తికి, సౌభాగ్యానికి శ్రీ మంగళగౌరి మూల మంత్ర దుర్గా దేవి సూక్త హవనం వేద మంత్రోచ్ఛరణ నడుమ వేద పండితులు చేపట్టారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు తూము రాజ్యలక్ష్మి, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, ఎక్స్‌అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ శ్రీ అమ్మవారి కుంకుమ పూజ, హోమాల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అలాగే డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారికి ఊంజల సేవను నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు.

వెంకన్నను దర్శించుకున్న భక్తులు...

మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేం దుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. స్వామివార్లకు వేద పండితులు విశేషాబి షేకాలతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయం వారు అన్న ప్రసాదాలను అందించేందుకు భారీ అన్నసమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాశక్తి - గుడివాడ : విజయదశమిని పురస్కరించుకుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు 7వ రోజు ఆదివారం అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలా డుతున్నాయి. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో ఉన్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అవతారంలో దర్శినమిచ్చారు. ఉత్సవ కమిటి చైర్మన్ పట్టపు చిన్న, కమిటి సభ్యులు, కార్యనిర్వహాణాధికారి గోపాలరావుల నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవ ములలో భాగంగా ఆదివారం మహాగౌరిదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. దేవస్థానము కమిటి చైర్మన్ నెరుసు బోసు, ఈవో కందుల వేణుగోపాలరావు, భక్తులు పాల్గొన్నారు. అలాగే గుడివాడలో ఉన్న వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో శ్రీమీనాక్షిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వారికి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కమిటి చైర్మన్ అంగడాల సతీష్, కమిటి సభ్యులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులోని కొండలమ్మ దేవస్థానంలో పూజలు చేస్తున్న దృశ్యం

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - నాగాయలంక : మత్స్యకారుల అభివద్ధి, సంక్షేమానికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల వెల్ఫేర్అండ్ డవలెప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్ది రాజు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన నాగాయలంక లో కష్ణానది ఒడ్డున ఉన్న ఫుడ్కోర్టులో నిర్వహించిన నియోజకవర్గం మత్స్యకారుల ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్స్యకారులు ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. అనంతరం ఎండు చేపల మార్కెట్ ను పెద్ది రాజు సందర్శించారు. మహిళా మత్స్యకారులు ఎండు చేపల తయారీలో ఎదురైతున్న ఇబ్బందులను చైర్మన్ పెద్దిరాజు దష్టికి తీసుకురాగా ఆయన స్పందిస్తూ నాణ్యమైన ఎండు చేపల తయారీకి అవసరమైన సోలార్ డైర్స్ ఏర్పాటుతో పాటు ఎండు చేపల తయారీకి కుటీర పరిశ్రమగా గుర్తింపు తీసుకొచ్చి అవసరమైన అన్ని వసతులు కలిపించేలాగ స్థానిక శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ తోకలసి కషి చేస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన మత్స్యకార నాయకులు లకనం నాగాంజనేయులు ఈ ప్రాంత మత్స్యకారుల సమస్యలను వివరించారు. మత్స్యకారుల రాష్ట్ర నాయకులు నడకుదిటి అర్జున్ సైకం భాస్కరరావు, లంకే నారాయణ ప్రసాద్‌లు మాట్లాడుతూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఆక్వా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బొట్లకు ఇస్తున్న ఆయిల్ సబ్సిడీ,పెంచాలని డిమాండ్ చేశారు. కృష్ణానది వరదల కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకోవాలని పలువురు కోరారు. కోపనాతి సత్యనారాయణ, కర్రి కృష్ణమూర్తి, భిక్షం, ఆదినారాయణ, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, ధనుంజయ, రాంకుమార్, లంకే శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

పులిచింతలకు భారీగా వరద

ప్రజాశక్తి–జగ్గయ్యపేట: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పులిచింతల ప్రాజెక్ట్‌కు వరద ఉధతి కొనసాగుతుంది. పులి చింతల ప్రాజెక్ట్ వద్ద 18 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 6,12,190 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 5,98,826 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 168.469 అడుగులు కాగా పూర్తిస్థాయి నీటిమట్టం 175.00 అడుగులుగా ఉంది. దీంతో ముక్త్యాల వద్ద కృష్ణా నదిలోకి పడవలను అధికారులు నిషేదించారు. ముక్త్యాల సమీపంలోని శ్రీ కోటిలింగాల హరిహర క్షేత్రం సమీపంలో చంద్రమ్మకయ్య దగ్గర వాగు పొంగటంతో ముక్త్యాలకు జగ్గయ్యపేటకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. వాహనాలు రాకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీనితో జగ్గయ్యపేట నుండి వచ్చే వాహనాలు ముక్త్యాలకు నుండి వచ్చే వాహనాలు సైతం అక్కడ ఎక్కడెక్కడే అయిపోయ్యాయి. వరద నేపథ్యంలో దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్లుగా ఎన్‌టిఆర్, కృష్ణా

ప్రజాశక్తి – ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఇంటర్–డిస్ట్రిక్ట్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ విజయవాడలో ముగిసింది. ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాలు వరుసగా పురుషుల, మహిళల టీమ్ ఈవెంట్‌లలో ఛాంపియన్‌లుగా నిలిచాయి. రెండు రోజుల టోర్నమెంట్ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరిగింది. జట్టు టైటిళ్లతో పాటు, అనంతపురంకు చెందిన ఎస్.ఆరోన్ రొనాల్డియన్, కృష్ణాజిల్లాకు పీ.లావణ్య వ్యక్తిగత పురుషుల, మహిళల సింగిల్స్ ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. పురుషుల టీమ్ ఈవెంట్‌లో, ఎన్‌టీఆర్ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. తరువాత శ్రీకాకుళం, కృష్ణా, కాకినాడ రెండవ, మూడవ, నాల్గవ స్థానాల్లో నిలిచాయి. మహిళల టీమ్ విభాగంలో, కృష్ణా జిల్లా మొదటి స్థానాన్ని దక్కించుకుంది, ఎన్‌టీఆర్, కాకినాడ, గుంటూరు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. పురుషుల సింగిల్స్‌లో ఎస్.ఆరోన్ రొనాల్డియన్ (అనంతపురం) మొదటి స్థానంలో, పి భాను ప్రకాష్ (అనంతపురం) రెండవ స్థానంలో, పివి చిన్వాస్ (ఎన్టీఆర్) మూడవ స్థానంలో, ఎం యుధీర్ (కృష్ణా) నాల్గవ స్థానంలో నిలిచారు. మహిళల సింగిల్స్‌లో పి లావణ్య (కృష్ణా) అగ్రస్థానంలో నిలిచారు. తరువాత ఎఎస్ వైశాలి (ఎన్టీఆర్), ఎం భావన, ఎన్ అనుష (కృష్ణా) ఉన్నారు. బహుమతులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున టోర్నమెంట్ పరిశీలకుడు కె.జగదీష్, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్ అందజేశారు.

శ్రీ సంతోషిమాత అలంకారంతో దుర్గమ్మ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దసరా ఉత్సవాల సందర్భంగా చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు ఆదివారం శ్రీ సంతోషిమాత దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ప్రారంభమైన ఏడవ రోజున ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ సంతోషిమాత దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు కె.నాగుల్ మీరా, సిపిఐ రాష్ట్ర నాయకులు దోనేపూడి శంకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళాశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 29న మూలా నక్షత్రం దృష్ట్యా సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా విచ్చేస్తారని, అందుకు అనుకూలమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు పోతిన బేసికంటేశ్వరుడు, కామందుల నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, పోతిన వెంకట ధర్మారావు, పిళ్ళా విజయ్ కుమార్, సూర్యకుమారి, భరత్ కుమార్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తరలించొద్దంటూ నిరసన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఐరన్ యార్డ్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల తరలింపును నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి వెలంపల్లి శ్రీనివాసరావు పాఠశాల ఎదుట ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, పేరెంట్స్ కమిటీకి సమాచారం ఇవ్వకుండా పాఠశాలను తరలించడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాల తరలింపును విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

7న విద్యారంగ సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి – విజయవాడ అర్బన్ : విద్యా రంగ సమస్యలు పరిష్కారం కోరుతూ అక్టోబర్ 7న నిర్వహించే రాష్ట్ర స్థాయి ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో కోరుతూ ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌డి ముస్తాక్, జిల్లా చైర్మన్ ఏ సుందరయ్య, సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఇంటి రాజు, కో చైర్మన్ జీ..రామారావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వి బిక్షమయ్య, ఏపిటీఎఫ్ నాయకులు లాల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.